హైఓల్టేజీతో విద్యుత్ పరికరాలు దగ్ధం

కుత్బుల్లాపూర్: ట్రాన్స్‌ఫార్మర్ మీదుగా వచ్చే లైన్ న్యూట్రల్ కట్ కావడంతో పలు ఇళ్లల్లో హైవోల్టేజ్ సరఫరాతో ఎలక్ట్రికల్ వస్తువులు దగ్ధమయ్యాయి. ఈ ఘటన సుచిత్ర పరిధిలోని వసంత విహార్ కాలనీలో జరిగింది. శుక్రవారం వసంత్ విహార్ కాలనీలో ఉండే ఇళ్లలో హైవోల్టేజ్ రావడంతో ఒకసారిగా మంటలు వ్యాపించాయి. కొన్ని ఎలక్ట్రికల్ పరికరాలు కాలిపోతున్న విషయాన్ని గుర్తించి మెయిన్ బంద్ చేశారు. సుమారు నాలుగు ఇళ్లల్లో హై వోల్టేజ్ ప్రభావం ఉండటంతో నష్టం వాటిల్లింది. ఈ విషయంపై కుత్బుల్లాపూర్ ఏడీఈ శ్రీకాంత్ స్పందిస్తూ... న్యూట్రల్ కట్ కావడం వల్ల సమస్య ఉత్పన్నమైందని, విషయం తెలవగానే తమ సిబ్బంది మరమ్మతులు చేశారని తెలిపారు.

భవానీ భక్తుల పాదయాత్ర



జగద్గిరిగుట్ట: దేవి నవరాత్రులు పూర్తి చేసుకున్న అమ్మవారి భక్తులు పాదయాత్ర నిర్వహించారు. జగద్గిరిగుట్ట షిరిడీ హిల్స్ నుంచి ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకోవడానికి గురువారం 10 మంది పాదయాత్రగా బయలుదేరి శుక్రవారం చేరుకున్నారు. ఈ పాదయాత్రను కార్పొరేటర్ జగన్ ప్రారంభించారు.

కాలుష్యాన్ని నియంత్రించండి!



జీడిమెట్ల: పీసీబీ నిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమల యాజమాన్యాలు కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. జీడిమెట్లలోని కొన్ని పరిశ్రమల నుంచి ప్రతినిత్యం నల్లటి పొగలను గాలిలోకి వదులుతున్నారు. దీంతో సమీప కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై స్థానికులు ఇప్పటికే పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

బాలానగర్: పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ ఘటన గురువారం ఉదయం జరిగింది. బాలానగర్ సీఐ నర్సింహ రాజు వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందిరా నగర్, ఐడీపీఎల్ హట్స్‌లో పేకాడుతున్నారని విశ్వసనీయ సమాచారంతో ఎస్ఐ సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేశారు. సిరిపురం కొండల్‌రావు (24), కోట చిన్నబాబు(45), లక్ష్మీ నారాయణ (26), బి. శివ (29), వి. వెంకటరమణలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.38,530 నగదుతో పాటు ఐదుదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



సయ్యద్ అలీ హుస్సేన్ రజ్వీ

జవహర్‌నగర్: వ్యక్తి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ అరుంధతినగర్‌లో సయ్యద్ అలీ హుస్సేన్ రజ్వీ (48) ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య జరీనా ఫాతీమా కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఈనెల 1న అలీ హుస్సేన్ రజ్వీ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

పోచారం: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన పిపల్ల మణికంఠ (25) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి సమయంలో ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం జీడిమెట్లలోని ఓ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాయితీ రుణాలు అందేదెన్నడో..?

నిరుద్యోగుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

- రాష్ట్ర అవతరణ రోజునే అందించాల్సిన వైనం
- 4 నెలలు కావస్తున్నా.. అందని మంజూరు పత్రాలు
- జిల్లాలో వచ్చిన దరఖాస్తులు 66,648



సాక్షి,మేడ్చల్ జిల్లా: జిల్లాలోని నిరుద్యోగ యువత రాయితీ రుణాల కోసం ఎదురు చూస్తున్నారు. ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల అధికారులు రాజీవ్ యువ వికాసం పేరిట దరఖాస్తులు స్వీకరించగా, ప్రభుత్వపరంగా ఉద్యోగాలు అంతంతమాత్రంగా ఉండడంతో ఈ పథకంతో స్వయం ఉపాధికి బాటలు వేసుకోవచ్చన్న ఉద్దేశంతో యువత పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు జూన్ 2న మంజూరు పత్రాలు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో నిరుద్యోగ యువతలో హర్షతీరేకాలు వ్యక్తమయ్యాయి. అయితే 4 నెలలుగా ప్రభుత్వం మంజూరు పత్రాలు అందించకపోగా, అవి ఎప్పుడూ అందుతాయో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నది.

భారీగా దరఖాస్తులు

రాజీవ్ యువ వికాసం పథకానికి నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 66,648 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా బీసీ సామాజిక వర్గం నుంచి బీసీ కార్పొరేషన్ కింద 13,400 యూనిట్ల లక్ష్యం కాగా, 37,935 మంది అర్జీలు అందించారు. రూ.50 వేల యూనిట్‌కు బ్యాంక్ రుణంతో సంబంధం లేకుండా వంద శాతం రాయితీ ఉండనున్నది. మిగతా యూనిట్లకు గరిష్ఠంగా రూ. 4 లక్షల వరకు ఎంచుకునే అవకాశం కల్పించగా రాయితీ 70 శాతం ఉంటోంది.

కమిటీలు ఏర్పాటు చేసినా..

శాఖల వారీగా అందిన దరఖాస్తులను మండల, మున్సిపల్ స్థాయి కమిటీలు పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. కమిటీల్లో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల, పట్టణ ప్రత్యేకాధికారులు, ఐకేపీ ఏపీఎం, సంక్షేమ శాఖల తరఫున సిబ్బంది, బ్యాంకు అధికారులకు స్థానం కల్పించారు. అయినా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో కమిటీలు నిస్సహాయ స్థితిలో ఉన్నాయి. ఇదిలా ఉండగా, ఉపాధి కల్పన లక్ష్యంగా రాయితీ రుణం కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువత మాత్రం 4 నెలలుగా ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వచ్చిన దరఖాస్తులు

సామాజికవర్గం	దరఖాస్తులు	యూనిట్ల లక్ష్యం
ఎస్సీ	16,300	6,201
ఎస్టీ	2,196	1,594
బీసీ సంక్షేమ శాఖ	37,935	13,400
మైనార్టీలు	10,217	3,415

నాలా స్థలాలు కబ్జా!

పట్టించుకోని అధికారులు



నాలా స్థలాన్ని కబ్జా చేసి కంచె వేసిన ప్రాంతం

జీడిమెట్ల: నాలా స్థలాలను కాపాడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో నాలాస్థలాలు కబ్జాదారుల చేతుల్లోకి పోతున్నాయి. సుభాష్‌నగర్‌లోని నాలాకు ఆనుకుని ఉన్న స్థలాన్ని ఇప్పటికే కొంతమంది వారి సొంత పరపతిని వాడి అధికారులను మేనేజ్ చేసి స్థలాన్ని కబ్జా చేసి ఇళ్లు నిర్మించినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్న స్థలాన్ని అయినా కాపాడాల్సిన అధికారులు మొద్దు నిద్రలో ఉండటంతో కబ్జాదారులు బరితెగిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కబ్జాదారులకు అధికారుల అండ!

కబ్జాలు చేసేవారు ముందుగానే సంబంధిత అధికారులను సంప్రదించి వారిని మేనేజ్ చేస్తూ కబ్జాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. దీనికి స్థానిక రాజకీయ నాయకులు సైతం వత్తాసు పలుకుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. అనుకోకుండా వరదలు వస్తే వర్షపు నీరు ఇళ్లల్లోకి వెళ్లే ప్రమాదం లేకపోలేదు. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన అధికారులు పట్టించుకోకపోతే ఇక స్థలాలకు దిక్కెవరు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

జాగృతి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా సంధ్యారెడ్డి



కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంధ్యారెడ్డి

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్‌కు చెందిన టి.సంధ్యారెడ్డి జాగృతి మహిళా విభాగం జాగృతి అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం సంధ్యారెడ్డికి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంధ్యారెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షురాలిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో జాగృతిని మరింత బలోపేతం చేస్తానన్నారు.

రోడ్డా.. డ్రమ్ముల డంపింగ్ కేంద్రమా?

ఎస్వీకో ఆపరేటివ్ సొసైటీలో రోడ్డుపై డ్రమ్ముల డంపింగ్..



జీడిమెట్ల: రోడ్లను ఆక్రమించి స్క్రాప్ వ్యాపారం నిర్వహిస్తున్న ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీ అధికారులు పట్టించుకోవడం లేదు. కొంతమంది తుక్కు వ్యాపారులు రోడ్లనే వ్యాపార సముదాయాలుగా చేసుకుంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి డ్రమ్ములను, ఇనుప తుక్కు సామానులను తీసుకువచ్చి ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీ రోడ్లలో డంప్ చేస్తున్నారు. రోడ్డుపైనే డ్రమ్ములను పగలగొడ్తు వ్యర్థాలను రోడ్లపై పారబోస్తున్నారు. రోడ్లపై విపరీతంగా డంపింగ్ చేస్తుండటంతో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని రోడ్లపై వ్యాపారాలు నిర్వహించే వారిని నియంత్రించాలని వాహనదారులు కోరుతున్నారు.

గంజాయి స్వాధీనం.. యువకుడి అరెస్టు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాల వద్ద గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సేవిస్తున్న ఓ యువకుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఎన్‌బీటీనగర్‌లో నివసిస్తూ డెకరేషన్ వర్క్ చేసే జి.ఆంజనేయులు అలియాస్ అంజి కొంతకాలంగా గంజాయి సేవిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు పక్కాగా దాడులు జరిపి సర్కార్ బడి ముందు గంజాయి సేవిస్తున్న ఆంజనేయులను శుక్రవారం మధ్యాహ్నం పట్టుకున్నారు. ఆయన నుంచి 5 గ్రాముల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.

గాంధీకి ఘన నివాళి

కుత్బుల్లాపూర్: అహింస, సత్యం, శాంతి మార్గాలను అనుసరించడమే గాంధీకి నిజమైన నివాళి అని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం షాపూర్‌నగర్‌లోని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో గాంధీ చేసిన సత్యాగ్రహాలు, పోరాటాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జయరామ్, మాజీ కౌన్సిలర్ బొబ్బ రంగారావు, సీహెచ్ బుచ్చిరెడ్డి, చాంద్ పాషా, కృష్ణ యాదవ్, చౌడా శ్రీనివాస్, నాగెళ్ల శ్రీనివాస్, ఖాజా భాయ్, ఆంజనేయులు, రాజిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీశైలంగౌడ్ తదితరులు

మురుగుతో తిప్పలు



కుత్బుల్లాపూర్: అధికారుల నిర్లక్ష్యం వల్ల వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు జీడిమెట్ల మరోవైపు సుభాష్ నగర్ డివిజన్లకు అనుసంధానంగా ఉన్న పైప్‌లైన్ రోడ్డులో సుమారు రూ.58 కోట్లతో స్టీల్ బ్రిడ్జి ఏర్పాటు కోసం ప్రణాళికలు రూపొందించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాకపోవడంతో డ్రైనేజీ పనులు అటకెక్కాయి. దీంతో పాతలైన్‌లో లీకేజీలు ఏర్పడి రోడ్డుపై మురుగు పారుతుంది. ఇలా లీకేజీలు ఏర్పడిన సమయంలో గల్వర్ సహాయంతో వాటిని తోడే ప్రయత్నం చేస్తున్నారే తప్ప.. శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ పనులు త్వరత గతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

నిధుల్లేక.. నీరసం..!

భారమవుతున్న పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల నిర్వహణ

- విడుదల కానీ హెచ్‌డీఎస్ నిధులు
- వసతుల్లేక రోగులకు తప్పని తిప్పలు
- నగర శివారుల్లో 38 అర్బన్, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు,
- 70పల్లె , 112 బస్తీ దవాఖానాలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: నిధుల లేమితో నగర శివారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ భారమవుతోంది. ప్రభుత్వం ఏటా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు హెచ్‌డీఎస్ (హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ) ద్వారా ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.1.75 లక్షలు అందజేస్తోంది. అయితే ఈ నిధులు కూడా 3 లేదా 6 నెలలకు ఒకసారి విడుదల చేస్తుండడంతో ఆరోగ్య కేంద్రాల నిర్వహణ ఇబ్బందికరంగా మారుతోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ సకాలంలో నిధులు విడుదలపై శ్రద్ధ చూపకపోవటంతో.. వసతుల్లేక రోగులకు తిప్పలు తప్పడం లేదు. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 38 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 26 యూపీహెచ్‌సీలు ఉండగా, పీహెచ్‌సీలు 12 ఉన్నాయి. వీటి పరిధిలో 70 పల్లె దవాఖానాలు, 112 బస్తీ దవాఖానాలు ఉన్నాయి. అలాగే, 8 పీహెచ్‌సీలు, 5 యూపీహెచ్‌సీలు రోగులకు 24 గంటల వైద్య సేవలు అందిస్తున్నాయి. అయితే నిధుల లేమితో ఇన్‌పెషెంట్లకు తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల వసతి కల్పించలేని దుస్థితి ఏర్పడుతోంది. ఇటీవల కలెక్టర్ పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి మూత్రశాలలు, మరుగుదొడ్లను పరిశీలించారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడం, అపరిశుభ్రంగా ఉండడంతో జిల్లా వైద్యాధికారిని ఆరా తీసిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అంతేగాకుండా వివిధ రకాల పరీక్షలను బయటకు రాస్తుండటంతో ఇక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండి.. లాభమేంటన్న ప్రశ్నలు పలువురి నుంచి ఉత్పన్నమవుతున్నాయి. నిధులు విడుదల కాకపోవడం వల్లే ఆరోగ్య కేంద్రాల నిర్వహణ కష్టమవుతోంది. దీనిని గుర్తించిన కలెక్టర్ తన నిధి నుంచి తక్షణమే ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు నిధులు విడుదల చేసినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నారు. ఈ విషయమై పీహెచ్‌సీ సిబ్బంది మాత్రం ప్రభుత్వం నుంచి నిర్వహణ నిధులు రావడం లేదని పేర్కొంటున్నారు. ఇవేగాకుండా ఇతర పథకాలకు సంబంధించిన నిధులు కూడా విడుదల కాలేదంటున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. నిధులు విడుదల కాగానే సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వసతుల పరంగా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూస్తామని సంబంధిత శాఖ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.



పుస్తకావిష్కరణ

సనత్‌నగర్: రచయిత నందిరాజు రాజరాజేశ్వరి రచించిన 'మహానుభావులు' పుస్తకావిష్కరణ కార్యక్రమం జెక్‌కాలనీలోని గాంధీవనంలో జరిగింది. విశ్వమానవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సోమా వెంకట్, వ్యవస్థాపకుడు మస్తాన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రీన్‌సిటీ అధినేత కే. సుబ్బరాజు పుస్తకావిష్కరణ చేయగా, సీహెచ్.అనంతరెడ్డి, డాక్టర్ మల్లు ప్రసాద్, విశ్వనాథరాజు, తెలంగాణ బాలోత్సవం కార్యదర్శి సోమయ్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమా వెంకట్ మాట్లాడుతూ.. విశ్వమానవ సంక్షేమ సంఘం 1987లో స్థాపించబడి 38 ఏళ్లుగా సేవ చేస్తున్నట్లు చెప్పారు. తాము మురికివాడల్లో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో 62 ట్యూషన్ సెంటర్లు నడుపుతున్నామని, వీటి ద్వారా పిల్లలకు చదువుతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సమయపాలన, మానవత్వం, భారతీయ సంస్కృతిపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. పుస్తకంలో గాంధీ, నెహ్రూ, తిలక్, గోఖలే, పొట్టి శ్రీరాములు, అంబేడ్కర్, దామోదరం సంజీవయ్య లాంటి స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర, ఇర కథలు ఉన్నాయని చెప్పారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

శమీ పూజ, రావణ దహనంలో పాల్గొన్న ప్రజలు

దసరా ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయల్లో నిర్వహించిన శమీ వృక్ష పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం రాత్రి రావణ దహన కాండ నిర్వహించారు. అంతకు ముందు అమ్మవార్ల ఆలయాలు, మండపాల వద్ద చివరి రోజు పూజలు జరిగాయి.

– కుత్బుల్లాపూర్



జీడిమెట్ల డివిజన్ దండమూడి ఎన్‌క్లేవ్‌లో జరిగిన శమీ పూజలో ఎమ్మెల్యే వివేకానంద్



కుత్బుల్లాపూర్ వేణుగోపాలస్వామి ఆలయంలో ..



నిజాంపేట్ దుర్గామాత ఆలయంలో..



కొంపల్లిలో జరిగిన శమీ పూజలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్



రంగారెడ్డినగర్‌లో జరిగిన రావణ దహనంలో పాల్గొన్న ప్రజలు



చింతల్ కోదండరామాలయంలో డీసీపీ పద్మజారెడ్డి దంపతులను సన్మానిస్తున్న సభ్యులు



దూలపల్లిలో జరిగిన రావణ దహనంలో పాల్గొన్న గ్రామస్తులు



పావురాలు ఎగురవేస్తున్న డీసీసీ మాజీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్



చింతల్ కల్యాణ తిరుపతి ఆలయంలో శమీ పూజలో పాల్గొన్న ప్రజలు



భౌరంపేట్ పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ఉత్సవంలో..